టీచర్ల బదిలీల షెడ్యూలు విడుదల

- ఎనిమిదేళ్లు కనీస సర్వీసు తప్పనిసరి - 14 నుండి 17 వరకు దరఖాస్తుల స్వీకరణ - సంక్రాంతి నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులు ఎన్నో రోజులుగా వేచి చూస్తున్నా బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. బదిలీలు చేపట్టాలని అనేక దఫాలుగా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనల చేపట్టడంతో ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి బదిలీలను నిర్వహించేందుకు ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ శనివారం బదిలీల షెడ్యూల్ను విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నట్లు వెల్లడించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపుగా 13000 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కనీసం ఎనిమిదేళ్ల సర్వీసును బదిలీకి పరిగణిం చారు. ఈ బదిలీల ప్రక్రియను సంక్రాంతి సెలవులు నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేపడుతున్నట్లు విద్యాశాఖ జారిచేసిన ఉత్తర్వులలో పేర్కొంది.

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ఇలా ఉంది

ఈనెల 12, 13 తేదీలలో ఖాళీల వివరాలు వెబ్ సైట్ లో ప్రదర్శన, ఈనెల 14 నుండి 17 వరకు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడం, ఈనెల 18,19 వరకుబదిలీ దరఖాస్తుల వెరిఫికేషన్, ఈనెల 20 నుండి 22 వరకు సీనియారిటీ లిస్టుల ప్రదర్శన , అభ్యంతరాల అప్‌లోడ్ చెయ్యడం, డిశంబర్ 23, 24లలో అన్ని రకాల అభ్యంతరాల పరిశీలన, ఫైనల్ చేయ్యడం, 26ఫైనల్ సీనియారిటీ జాబితాల ప్రదర్శన, 27 నుండి జనవరి 1 వరకువెబ్ ఆప్షన్లు పెట్టుకోడానికి అవకాశం, జనవరి 2 నుండి 10 వరకుబదిలీ కోరుకున్న వారికి పాఠశాలల కేటాయింపు, జనవరి 11 తేదీలో కేటాయింపులో ఏమైనా తేడాలు ఉంటే అబ్జక్షన్లు, జనవరి 12 బదిలీ ఉత్తర్వులు డౌన్ లోడ్ చేసుకోవడం.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- విద్యార్థులకు మాజీ సిఎస్ ఐవైఆర్ కృష్ణారావు సూచన
- ఘనంగా సిల్వర్ జూబ్లీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను జ్యోతి ప్రజ్వోలన చేసి ప్రారంభిస్తున్న ఐవైఆర్ కృష్ణారావు, విసిలు

సిల్వర్ జూబ్లీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐ వై ఆర్ కృష్ణారావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు సూచించారు. శనివారం కర్నూలు బి క్యాంపులో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐవైఆర్ కష్ణారావు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. సత్యనారాయణ, క్లస్టర్ , రాయలసీమ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు సాయి గోపాల్ , ఆనందరావు, ఇన్కమ్ టాక్స్ చీఫ్ కమిషనర్ భూపాల్ రెడ్డి, కళాశాల మాజీ ప్రిన్సిపల్స్ కోటిరెడ్డి, రమణయ్యలు పాల్గొన్నారు. ముందుగా ఎన్‌సిసి విద్యార్థుల నుండి ముఖ్య అతిథులు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కళాశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కళాశాల అభివృద్ధికి తను ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎండి సత్యనారాయణ మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ కళాశాల నుండి చదివి తాను ఈ స్థాయికి ఎదగానని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ పనిచేసే సమయంలో కళాశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. కళాశాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్లు సాయి గోపాల్, ఆనందరావు మాట్లాడుతూ ఈ కళాశాల ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఎంతోమంది ప్రతిభ కలిగిన విద్యార్థులను అందించి పలు ప్రాంతాల్లో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యార్థులు కూడా విద్యాభ్యాసం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను కళాశాల ప్రిన్సిపల్ ఇతర అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. పలు రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగార్జున రెడ్డి జీవన్ కిరణ్, ఉపాధ్యక్షులు కొండాచారి, శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, డ్రగ్స్ కేంద్రంగా ఎపి

తెలుగుయువత నాయకుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మత్తుపదార్థాలు, డ్రగ్స్, ఎగుమతి కేంద్రంగా ఎపిని మార్చారని తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్, తెలుగుయువత పార్లమెంట్ అధ్యక్షులు ఎస్.అబ్బాస్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పిజి.గోపీనాథ్, ప్రభాకర్ యాదవ్ ఆరోపించారు. శనివారం తెలుగుయువత కార్యకర్తలతో కలిసి డ్రగ్స్, గంజాయి ఎగుమతులను అరికట్టి యువతకు ఉపాధి చూపాలని నిరసన తెలిపారు. దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు గంజాయి, డ్రగ్స్‌కు నిలయంగా మారిందని అన్నారు. 2021-22 ఏడాదిలో దేశంలో పట్టుబడిన డ్రగ్స్‌పై కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన నివేదికలో మిగిలిన రాష్ట్రాల కంటే అత్యధికంగా కేంద్ర బలగాలు ఎపిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిందని, దీనిని బట్టి రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా ఎంతగా మారిపోయిందో తెలుస్తుందన్నారు. ఎపిలో 18,267 కేజీల డ్రగ్గును సిఆర్‌పిఎఫ్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించిందన్నారు. 1,057 కేజీల గంజాయి, రూ.97 కోట్ల విలువైన 165 టన్నుల ఎర్ర చందనాన్ని కేంద్ర బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 7,49,761 కిలోల గంజాయి పట్టుబడితే అందులో 2,00588 కిలోలు మన రాష్ట్రంలోనే పట్టుబడినట్లు వారు వెల్లడించారు. తూర్పు గోదావరి, విశాఖ ఏజన్సీ ఏరియాలో విజయసాయిరెడ్డి, స్థానిక వైసిపి నేతల సూచనలతో సుమారు 15 వేల ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి డ్రగ్స్, గంజాయి ఎగుతులను అరికట్టాలని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించి యువతను మత్తుపదార్థాలకు దూరమయ్యేలా చూడాని కోరారు.

దున్నపోతుకు వినతి ఇచ్చి నిరసన తెలుపుతున్న తెలుగు యువత

గర్జనతో ఒరిగిందేమిటి?

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ జెఎసి పేరుతో రాయలసీమ గర్జన అని కార్యక్రమం నిర్వహించారు. జెఎసిలోనూ నాన్ పొలిటికల్ జెఎసి, పొలిటికల్ జెఎసి అంటూ విభజించారు. పొలిటికల్ జెఎసిలో అధికారపార్టీ నేతలు తప్ప ఇతర నాయకులెవరూ లేరు. ఆ కార్యక్రమానికి కళాశాలల నుండి విద్యార్థులను తరలించారు. ఎండ వేడికి తట్టుకోలేక విద్యార్థులు మధ్యలోనే లేసి వెళ్ళిపోయారు. కార్యక్రమంలో మాట్లాడిన అందరి ప్రసంగ సారాంశం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలనే. మరో పక్క ప్రతిపక్ష నాయకుడిపై విమర్శలు. అసలు ఆ డిమాండ్లు అధికారంలో ఉండే వారు చేస్తే అవి నెరవేర్చాల్సింది ఎవరు? ఆ గర్జన ఎవరి కోసం? అనేవి సామాన్యుని మదిలో మెదులుతున్న ప్రశ్నలు. హైకోర్టును కర్నూలులో పెట్టడానికి అన్ని పార్టీలు ఒప్పుకున్నాయి. కానీ ఏర్పాటుకు వైసిపి ప్రభుత్వం వెనక్కి జంకుతోంది. చంద్రబాబు అడ్డం పడుతున్నారని విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు అడ్డం పడటం వల్లే ఆగిపోయినట్లయితే వైసిపి ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలను చంద్రబాబు వ్యతిరేకిస్తున్నారు. అంత మాత్రాన వాటిని అమలు చేయకుండా ఆపేస్తున్నారా? 2024లో జగన్ అధికారంలోకి వాస్తే రాయలసీమకు మేలు చేస్తారని, ప్రాజెక్టులు తెచ్చి సస్యశ్యామలం చేస్తారని నాయకులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో ఉంది కూడా జగనే కదా? 2024లోనే ఎందుకు చేయాలనుకుంటున్నారు? ఇప్పుడు చేయడం ఇష్టం లేదా...అంటే అది ఒక ఎన్నికల స్టంట్ గానే కనిపిస్తోంది. గతంలోని టీడీపీతో పాటు ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వం కూడా రాయలసీమలో ప్రాజెక్టులపై చిన్న చూపు చూస్తూనే ఉన్నాయి. కరువు, వలసల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే హామీల వర్షం గుప్పిస్తున్నారు.

పరీక్ష ఎవరికి..?

పరీక్ష పెట్టేందుకు ఉపాధ్యాయులకూ పరీక్ష తప్పడం లేదు. గతంలో ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రశ్నపత్రాలను రాష్ట్ర విద్యా పరి శోధనా సంస్థ విడుదల చేసేది. వాటికి సంబంధించిన సమాధానాలు తెల్ల పేపరు లేదా ప్రత్యేక నోటు పుస్తకంలో రాయించేవారు. సమ్మేటివ్ పరీక్షకు మాత్రమే ఏకరూప ప్రశ్న పత్రం విధానం ఉండేది. ప్రశ్నపత్రాలను విద్యా శాఖనే పంపిణీ చేసేది. ప్రస్తుతం ఫార్మేటివ్ పరీక్షలకూ ఒకే ప్రశ్న పత్రం ఉండాలని విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. పరీక్ష ముందు రోజు అర్ధరాత్రి 1 గంటకు ప్రధానోపాధ్యాయుడి వాట్సప్ నకు ప్రశ్నపత్రం వస్తోంది. ఉదయాన్నే ఆయా ఉపాధ్యాయులకు వాట్సప్ ద్వారా పంపితే వారు తరగతి గదుల్లోని బ్లాకు బోర్డుపై చూసుకుంటూ ప్రశ్నలు రాసుకుని పరీక్ష రాయాల్సి వస్తోంది.

సర్దుబాట్లు..

ఈ విద్యా సంవత్సరం ఆరు నెలలు గడిచిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ చర్యల పట్ల ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ సమయంలో సర్దుబాటుకు ఎందుకు చేస్తున్నారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కాలంలో పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించిన వారికి ఎక్కడా స్థానాలు కేటాయించలేదు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో దాదాపుగా 8000 మందికి పైగా ఉపాధ్యాయులు పలు రకాల కేడర్ ల లో పనిచేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు స్కూల్ మ్యాపింగ్ పూర్తయినటువంటి నేపథ్యంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు సిద్ధమైంది.

అవీ..ఇవీ..అన్నీ..

కర్నూలు సిటీ ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణ కార్మికులపై చేస్తున్న దాడులకు నిరసనగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయుల అక్రమ సర్దుబాటు ఆపాలని డిఇఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రబీ పూర్తయ్యే వరకు హంద్రీనీవా ద్వారా నీళ్ళు విడుదల చేయాలని దేవనకొండ తహశీల్దార్ కార్యాలయాన్ని రైతులు దిగ్భంధించారు. ఎఐకెఎస్ జాతీయ మహాసభ సందర్భంగా చేపట్టిన అమరవీరుల జ్యోతి జాతా జిల్లాలో సాగింది. కర్నూలు సి క్యాంప్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళులు అర్పించారు. అంతర్జాతీయ వికలాంగ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఆడ పిల్లలను రక్షిద్దాం : కాటసాని

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

ఆడపిల్లలను రక్షించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో అంగన్ వాడి కేంద్రంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, ఐసిడిఎస్ కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గోడపత్రికలు విడుదల చేసి ప్రసంగించారు. బాలికల విద్య, వైద్యంతో పాటు వారి రక్షణ కోసం రూపొందించిన చట్టాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. బాల్య వివావాహాలు నేరమని, ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జిల్లా మైనారిటీ అధికారి మహబూబ్‌బాషా, సంభందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్టులు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలి

డాక్టర్ శంకర్‌శర్మ సూచన

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్: క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాల జిస్టు డాక్టర్ శంకరశర్మ సూచించారు. శనివారం ఏ క్యాంప్‌లోని జోలాపురం రోడ్డు రాయల్ కిడ్స్ టెన్నిస్ అకాడమీలో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ శంకర్‌శర్మ మాట్లా డుతూ చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలన్నారు. ఆత్మ రక్షణకు కరాటే తైక్వాండో ప్రతి ఒక విద్యార్థిని సాధన చేయాలన్నారు. క్రీడా సాధన చేయడం వలన ఆరోగ్యం, ఆత్మ రక్షణ , ఏకాగ్రత, క్రమశిక్షణ , పట్టుదలను పెంచుతుందని అన్నారు. చదువు పాటు తమ పిల్లల్ని తల్లిదండ్రులు క్రీడల ఆసక్తి పెంచాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.రామ్మోహన్, ప్రొఫెసర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ జి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ తైక్వాండో శిక్షకులు సీనియర్ వెంకటేశ్వర్లు, భాస్కర్, వీరేష్ రావు అలాగే చీఫ్ ఇన్ సెక్టర్స్ మధుసూదన్ రెడ్డి, హౌజా, ఉదయ్ కుమార్, హనుమంత్ , విశాల్ , విద్యార్థులు తల్లిదండ్రులు, టెన్నిస్ క్రీడాకారులు టెన్నిస్ కోచ్ మేఘనాథ్ పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు : వైసిపి ప్రభుత్వం ఉన్నంత కాలం అర్హులం దరికీ సంక్షేమ పథకాలు అందు తాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ అన్నారు. కోడుమూరు నియోజక వర్గం కల్లపరి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ,స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథ కాలను వివరించారు. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థతో ఇళ్ల వద్దకే పథకాలు వచ్చేలా జగనన్న పాలన సాగుతోందన్నారు. జగనన్న సిఎంగా ఉన్నంతవరకు సంక్షేమ పథకాలు ఆగవని అన్నారు. జనరంజక పాలన అందిస్తున్న సిఎం జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. సర్పంచి రంగమ్మ, ఎంపిటిసి లతమ్మ, పులంధర్ రెడ్డి, జీవన్, మండల అధి.కారులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యు సుధాకర్

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్యాబ్ డ్రైవర్స్ పెండింగ్ జీతాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కర్నూలు పున్నమి గెస్ట్ హౌస్ దగ్గర క్యాబ్ ఆటోల పార్కింగ్ దగ్గర అబ్దుల్ దేశాయి అధ్యక్షతన నిరసన తెలిపారు. క్యాబ్ డ్రైవర్ కార్మికులనుద్దేశించి సిఐటియు ఓల్డ్ సిటీ సెక్రెటరీ మారెళ్ళ (రామాంజనేయులు)విజయ్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజగోపాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో ప్రజలు వినియోగించిన వేస్ట్ చెత్తను వీధులలో కుప్పలుగా వేయకుండా, మురుగు కాలువల్లో వేయకుండా ప్రజల నివాసాల నుండి చెత్తను సేకరించి స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్యాబ్ (ఆటో) ల ద్వారా కంపోస్టు యార్డు తరలించాలని నిర్ణయించింది. క్యాబ్ డ్రైవర్స్‌కు రెడ్డి ఏజెన్సీ వారు నెలల తరబడి జీతాలు ఇవ్వనందున కార్మికుల కుటుంబాలు గడవడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. గతంలో కూడా కనీస వేతనం అమలు చేయకుండా తక్కువ జీతాలు ఇచ్చారన్నారు. సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇఎస్‌ఐ, ఇపిఎఫ్ వారి జీతాల్లో కట్ చేస్తున్నారన్నారు. వారికి పిఎఫ్ అకౌంట్ నెంబర్లు ఇవ్వకపోవడం, కట్ అయిన డబ్బులు వారి అకౌంట్లో వేయకపోవడం చాలా దుర్మార్గన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏ ఒక్క కార్మికుడు నష్టపోకుండా, ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వ మే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం, పని భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఏజెన్సీలను రద్దు చేయకుండా మాట తప్పి మడమ తిప్పారని విమర్శించారు. సిఎం అనుయాయుల కోసం కొత్త ఏజెన్సీలు పెట్టుకోవడానికి అవకాశం కల్పించి రాష్ట్రాన్ని దోచి పెడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడానికి పూనుకుంటే వారికి మద్దతిచ్చారని తెలిపారు. మన రాష్ట్రంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోగా వారిని దొడ్డి దారిన తీసివేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. క్యాబ్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26,000 జీతం ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని,పెండింగులో ఉన్న జీతాలు తక్షణమే ఇప్పించాలన్నారు. ఇప్పటికైనా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్యాబ్ డ్రైవర్లకు జీతాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ ఇతర సమస్యలను పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి పోరాడుతామని హెచ్చరించారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న విజయ్ , రాజగోపాల్

టిడిపి అధికారంలోకి వస్తే గుండ్రేవులకు మహర్దశ

ప్రజాశక్తి-సి బెళగల్

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే మండలంలోని గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి మహర్దశ అని మాజీ కేంద్రమంత్రి కోట్ల జయజయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పోలకల్‌లో టిడిపి ఇన్‌ఛార్జి ప్రభాకర్, మండల కన్వీనర్ గోవిందగౌడ్ సమక్షంలో ఇదేం కర్మ కార్యక్రమం చేపట్టారు. వైసిపి నియతృత్వ పాలనపై ఘాటుగా విమర్శలు చేశారు. ఓటు కోసం దిగజారుడు పాలన చేస్తున్న వైఎస్.జగన్ కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలని అన్నారు. సామాన్య ప్రజల సంక్షేమం శూన్యమని అందుకే టిడిపి బాసటగా నిలవాలని కోరారు. అధికారంలోకొస్తే గుండ్రేవులను నిర్మించి కర్నూలు, అనంతపురం జిల్లాకు మూడు పంటలకు తప్పక సాగునిరందిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు గంపరాజు వెంకటేష్, చిన్న మునెప్ప, అయ్యస్వామి నెహమ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

ముస్లిం మైనార్టీలు ఐక్యం కావాలి : ఆవాజ్

కర్నూలు కార్పొరేషన్ : ముస్లిం మైనార్టీలు తమ హక్కుల సాధన కోసం ఐక్యమవ్వాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్ఎ. సుభాన్ కోరారు. శనివారం కర్నూలు చిత్తారి వీధి అవాజ్, వార్డు కమిటీ సర్వసభ్య సమావేశం, అబ్దుల్ రహమాన్ అధ్యక్షతన జరిగింది. ఎస్ఏ.సుభాన్, నగర కార్యదర్శి ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని వైసిపి మైనార్టీల హక్కులను, కాలరాస్తున్నాయని, ముఖ్యంగా బిజెపి ముస్లిం, దళిత మైనార్టీలతోపాటు సిక్కులు, జైన్‌ను దళితులను అణిచివేయాలని చూస్తుందని ఘాటుగా విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేన కూడా మైనార్టీలకు మద్దతు తెలపడం లేదనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఆవాజ్ నగర నాయకులు మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ వైసిపి, టిడిపి ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. జనసేన కూడా అదే తానులోని గుడ్డఅని ఎద్దేవా చేశారు. ఆవాజ్ కమిటీ 5 వ వార్డు అధ్యక్షులుగా గౌస్‌బాష, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రహమాన్ ఉపాధ్యక్షులుగా అబరార్, మాలిక్, సలీంలు, సహాయ కార్యదర్శులుగా షేక్షావలి, తాజుద్దీన్, నాసిర్‌లను వీరితో పాటు మరో 17 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఖలీల్, హాజీబాష, ముస్తఫా, చాంద్ ఆర్‌టిసి,సమీర్, షాబాజ్, ఇస్మాయిల్, అసిఫ్, మహేబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎ.సుభాన్

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ పల్లవి , స్థానికులు

వర్షంలోనూ గడప గడపకు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు క్రైమ్: జోహరాపురం 18వ వార్డు 44వ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ శనివారం నిర్వహించారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా కార్యక్రమాన్ని కొనసాగించారు. కవార్డు నాయకులు ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్ళలో వైసిపి ప్రభుత్వం పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరికి మంచి చెయ్యాలనే ఆలోచనతో సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటున్నామన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారికీ ఇప్పించే బాధ్యత తనదన్నారు. 44వ సచివాలయంలోని సిబ్బంది శానిటేషన్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాసులు , వాలంటీర్ మహమ్మద్ పీరా పనితీరు బాగా లేనందున వారిని సస్పెండ్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు 18వ వార్డ్ కార్పొరేటర్ పల్లవి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించండి

కర్నూలు కలెక్టరేట్: మానవ హక్కులను పరిరక్షించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం సూచించారు. శని వారం నగరంలోని స్థానిక కొత్త బస్టాండులో ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వ హించారు. జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె డేవిడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షులు పద్మానందయోగి, వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా హక్కుల రక్షణకు ఎలాంటి భద్రత ఏర్పాటు చేయడంలేదన్నారు. హక్కుల కోసం పోరాడే వారి పైన రాజ ద్రోహం కేసులతో అణచివేస్తున్నారన్నారు. ప్రతి నెల యువత కోసం, చైతన్యం పరిజ్ఞానంకోసం సెమినార్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పురుషోత్తం, రవిప్రసాద్, శివమణి, రవికుమార్, కొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యక్షులు కె.బలరాం

క్రీడల్లో రాణించి ఎమ్మిగనూరుకు పేరు తేవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటి ఎమ్మిగనూరు పేరు నిలబెట్టాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా కబడ్డీ జట్టు తరపున రాష్ట్రస్థాయికి ఎంపికైన పది మంది ఎమ్మిగనూరు క్రీడాకారులు ఈనెల 12న చిత్తూరు జిల్లా నగరిలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు శనివారం నాడు క్రీడాకారులకు ఎమ్మెల్యే ట్రాక్ సూట్ కిట్లను అందజేశారు. పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ పదివేలు విలువ చేసే క్రీడా దుస్తులను ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, పిడి రాజారాంమోహన్, టీమ్ మేనేజర్ గోపాల్, పియిటి లు అస్లాం, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట

గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం : సిఐటియు

ప్రజాశక్తి - హోళగుంద

రైతులను గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని రైతు సంఘం, సిఐటియు నాయకులు పేర్కొన్నారు. శనివారం నాడు మండలంలోని ఇంగలదహల్ గ్రామంలో కార్మిక రైతు సంఘం జెండాను సిఐటియు మండల అధ్యక్షులు వెంకటేష్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నా.. ప్రభుత్వాలు మాత్రం చూసి చూడనట్టు ఉండటం సిగ్గుచేటు అన్నారు. రైతులు కల్తీ విత్తనాల వల్ల మోసపోతున్నారని, అలాంటి వాళ్ళపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు, మందులు సరఫరా చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ ప్రమాదం వల్ల 10 ఎకరాల గడ్డి వాము కాలిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రసాద్,రమంజి,శ్రీను,చందప్ప ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పరమేష్ నాయకులు విరేష్,మల్లేష్,పాండు నాగరాజు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

వాసి ఆకారం నికితకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - మంత్రాలయం

యూనివర్సిటీ ద్వారా గోల్డ్ మెడల్‌ను మంత్రాలయం వాసులు ఆకారం సుమలత, ప్రహ్లద శెట్టి దంపతుల కూతురు నికిత దక్కించుకుంది. శనివారం కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన యం విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సాంకేతిక విశ్వవిద్యాలయంలో 2015-19 బ్యాచ్‌లో ఎలెక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరిం గ్‌లో 4వ ర్యాంకు సాధించి బంగారు పతకం అందుకున్నా రు. విశ్వవిద్యాలయ ద్వారా గోల్డ్ మెడల్ పొంది న కుమారి ఆకారం నికితకు గ్రామస్తుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

గోల్డ్ మెడల్‌ను స్వీకరిస్తున్న నికిత

బిజెపి విధానాలపై సంఘటితంగా ఉద్యమించాలి - సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బిజెపి ప్రభుత్వ విధానాలపై కార్మికులు, కర్షకులు సంఘటితంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి రామాంజనేయులు, మండల కన్వీనర్ బి రాముడు పేర్కొన్నారు. శనివారం నాడు సిఐటియు మండల కార్యకర్తల సమావేశం ఎస్ ఆంథోనీ అధ్యక్షతన నిర్వహించారు. 2014 తర్వాత అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షకులకు జీవన ప్రమాణాలు దెబ్బతీసే విధంగా వ్యవసాయ చట్టాలపై కార్మిక చట్టాలపై అనేక మార్పులు తెచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారన్నారు. సమావేశంలో సిఐటియు వినాయకులు రాజు ఆంటోనీ, శివలక్ష్మి, జయమ్మ, రాజు, రాజన్న, నరసింహులు, రవికుమార్, గుంటప్ప, ఉస్మాన్ వలి, ఇస్మాయిల్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

సిపిఎస్ రద్దును కోరుతూ 5కె వాక్ : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో5కె వాక్ నిర్వహించారు. శనివారం స్థానిక ఫైర్ స్టేషన్ దగ్గర జిల్లా అధ్యక్షుడు జె.ఎల్లప్ప వాక్‌ను యుటిఎఫ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రాక ముందు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానంటూ ఇచ్చిన హామీ.. అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు కావస్తున్న సిపిఎస్ రద్దు చేయకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు మరింత నష్టం చేకూర్చే జిపిఎస్ పథకాన్ని అమలు చేస్తామనడం దారుణం అన్నారు. సిపిఎస్ రద్దు కోరకు యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే సిపిఎస్ జిపిఎస్ వల్లఉపాధ్యాయులకు ఉద్యోగులకు కలిగే నష్టాలను తెలియజేస్తూ కరపత్రాలు, సంతకాల సేకరణ కార్యక్రమంలు నిర్వహించామని, సిపిఎస్ ఉపాధ్యాయుల ఇళ్ళకు వెళ్ళి పాత పెన్షన్ ఆవశ్యకతను తెలియజేశామని తెలిపారు. పోరాటాలలో భాగంగా ఫైర్ స్టేషన్ నుండి అన్నమయ్య సర్కిల్,శివసర్కిల్,సోమప్ప సర్కిల్, శ్రీనివాస థియేటర్, హాస్పిటల్ మీదుగా తాసిల్దార్ కార్యాలయం వరకు నడక జరిగింది అని తెలిపారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానము అమలు చేయాలని లేనిపక్షంలో సిపిఎస్ రద్దుకై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దావీదు, నరసింహులు, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు వివిధ మండలాల నాయకులు వై.రామాంజనేయులు, చిన్న ఎల్లప్ప,రాజు, లక్ష్మన్న శివకుమార్ ,ప్రసాద్,సుధాకర్ చంద్రపాల్, భీమేష్, తులసమ్మ ఎం కె విజయలక్ష్మి, ఉమా సుమలత,పద్మావతి శ్రీనివాసులు, తాయప్ప శంకరయ్య, ఆంజనేయులు రవికుమార్, అయ్య స్వాములు అశోక్, రాందాస్, నాగరాజు బిజికేషన్న, పెద్దా రెడ్డి, శంకర్ నాయక్ లతీఫ్ పెద్దకాజన్న తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో 5 కె వాక్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆప్కాబ్ ద్వారా అన్ని రకాల సేవలు : ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - గోనెగండ్ల

వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని రకాల రుణ, వాణిజ్య సేవలను అందించడం హర్షణీయం అని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారి రామాంజనేయులు, కర్నూలు జిల్లా సహకార బ్యాంకు సీఈఓ రామాంజనేయులు అన్నారు. శనివారం గోనెగండ్ల మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఆప్కాబ్ నిధుల ద్వారా రూ.14 లక్షలతో నూతనంగా నిర్మించిన వ్యాపార సముదాయాన్ని వారు ప్రారంభించారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షురాలు ఆర్ లక్ష్మీ దేవమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాలకు అదనపు ఆదాయం చేకూర్చే లక్ష్యంతో ఆప్కాబ్ నిధులతో కమర్షియల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించినట్లు వారు తెలిపారు. త్వరలో సొసైటీల ద్వారా రైతు గోడౌన్లు, పెట్రోలు బంకులు, గోల్డ్ లోన్ల తోపాటు బ్యాంకులలో ఉండే అన్ని సర్వీసులను అందించాలన్నదే లక్ష్యం అని అన్నారు. స్థానిక ప్రజల వినతి మేరకు సొసైటీ ఫిజిబిలిటీ రిపోర్టు చూసుకొని కళ్యాణ మండపం నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన జమ్మన్న అనే రైతు సొసైటీలో రుణం తీసుకొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ప్రమాద బీమా ద్వారా లభించిన రెండు లక్షల రూపాయల చెక్కును అతని భార్య దుగ్గెమ్మకు ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఏజీఎం విజయ్ కుమార్, మేనేజర్ భరద్వాజ్ శర్మ, కోడుమూరు మేనేజర్ రవికుమార్, గోనెగండ్ల ఎంపీపీ నసురుద్దీన్, వైసిపి మండల నాయకులు అలవాల ప్రమోద్ రెడ్డి, ఎస్బి మన్సూర్ కాశిరెడ్డి, టి బందే నవాజ్, దొరబాబు నాయుడు, కైరవాడి ఖాజాబంద, మోహన్ రెడ్డి, గాజులదిన్నె సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, లోకనాథరెడ్డి, సొసైటీ సీఈఓ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కోసిగి

మధ్యాహ్న భోజన కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కేపీ నారాయణస్వామి కోరారు. సిఐటియు కోసిగి మండల ఉపాధ్యక్షులు కే.వీరేష్ అధ్యక్షతన జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు బియ్యం కోసం మండల కేంద్రానికి వచ్చి తీసుకోవాల్సి ఉందని, దీనివల్ల మధ్యన భోజన కార్మికులకు అదనపు భారం పడుతుందని మండలంలోని అధికారులు ఆయా గ్రామాల్లోనే పాఠశాలకు బియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా కొన్ని పాఠశాలలో విద్యార్థులకు సరిపడా బియ్యం ఇవ్వడం లేదని దీనివల్ల మధ్యాహ్న భోజనకార్మికులు నష్టపోతారని ఆయన అన్నారు. బిల్లులు కూడా సక్రమంగా అందడం లేదని ప్రభుత్వం ప్రతినెల బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అంతేకాకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచి, గౌరవేతనము పెంచాలని, ఉద్యోగ భద్రత ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యము సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రాముడు, మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు అక్కర్మ, కాడమ్మా,కామాక్షమ్మ,సత్యవతి, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షులు కేపీ నారాయణ స్వామి

రాఘవేంద్రుని సన్నిధిలో విదేశీ భక్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామిని విదేశీ భక్తులు హిందూ సంప్రదాయ పద్ధతిలో వస్త్రధారణతో దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి శ్రీ విశ్వానంద గురూజీ నేతృత్వంలో "భక్తి మార్గ ఇండియా" కార్యక్రమంలో భాగంగా సుమారు వంద మందికి పైగా శ్రీ కృష్ణ భగవానుడి శిష్యులు క్షేత్రాన్ని చేరుకొని గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల దర్శించుకున్నారు. జర్మనీ, దక్షిణాఫ్రికా, రష్యా, పోలాండ్ మొదలైన దేశాల నుండి భక్తులు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చారు. వారు హిందూ ధర్మ సంప్రదాయ దుస్తులలో వచ్చి కీర్తనలు, శ్రీకృష్ణ మంత్రాన్ని పఠించారు. శనివారం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు బ్రిటీష్ కాలంలో ఇనామ్స్ కమిషనర్ సర్ థామస్ మన్రో సందర్శన గురించి వివరించారు. రాఘవేంద్రస్వామి సజీవంగా బృందావన ప్రవేశం చేసి నేటికి 350 సంవత్సరాలు గడిచిందని తెలిపారు. శ్రీ రాఘవేంద్రస్వామి గొప్ప ఆధ్యాత్మిక గురువు అని వేదాలపై ఆయన రచించిన వ్యాఖ్యానం జర్మనీ లైబ్రరీలో భద్రపరచబడిందని శ్రీ విశ్వానంద గురూజీకి గుర్తు చేశారు. అనంతరం విదేశీ సందర్శకులందరితో శ్రీ రాఘవేంద్ర స్తోత్రాన్ని జపిస్తూ వారితో కలిసి ప్రాకార ప్రదక్షిణ చేశారు. శ్రీ విశ్వానంద గురూజీతో పాటు విదేశీ భక్తులకు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమోంటో అందజేసి ఆశీర్వదించారు.

శ్రీమఠంలో విదేశీయులు

రాఘవేంద్రుని సన్నిధిలో మాజీ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్

రాఘవేంద్రుని సన్నిధిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామిని మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ శనివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ఆయనకు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమోంటో అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయనకు సిఐ భాస్కర్ ఎస్ఐ వేణుగోపాల్ రాజు పోలీసు సిబ్బంది భద్రత కల్పించారు.

జీతాలు జాప్యంపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ఉద్యోగులకు పెన్షన్ దారులకు జీతాలు చెల్లింపులు ప్రభుత్వం నిర్లక్ష్యం వాయించడంపై శ్వేత పత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆదోని నియోజకవర్గం ఇన్చార్జి మీనాక్షి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల తో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు, ఫించన్ల చెల్లింపు జాప్యంపై చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం న్నారు. పదోతారీఖు వచ్చినా ఉద్యోగులకు, ఫించన్లు చెల్లించకపోవడం దారుణమన్నారు. వచ్చిన ఆదాయాన్ని, నిధులకు తమ ఖాతాల్లో వేసుకుని దారి మళ్లిస్తున్నారన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుకు మూడు నుంచి ఆరు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉన్న ప్రభుత్వం నిర్లక్ష్యం వాయించడం ఏమిటి అని నిలదీశారు పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు కుడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వైసిపి సర్పంచ్‌లే ఆందోళన దిగడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. తుఫాను హెచ్చరికలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సరైన ముందస్తు చర్యలు తీసుకోలేదని ఎద్దేవ చేశారు. జిల్లా వ్యాప్తంగా తుఫాను కారణంగా పంటలు పాడయ్యే పరిస్థితి ఏర్పడిందని ప్రత్నమయ్య చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలికల కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గురుకుల బాలికల కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అజిత్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు రాము, ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు సైపుల్లా డిమాండ్ చేశారు. శనివారం బనవాసి గురుకుల కళాశాలను ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించడం జరిగింది. మూడు రోజుల క్రితం విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరడం తెలిసిన విషయం,అందులో భాగంగా కళాశాలలో మౌలిక వసతుల, తాగునీటి, భోజనము గురించి ఇంచార్జ్ శ్రీదేవిని ఎస్ఎఫ్ఐ నాయకులు అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన శాలను, డైనింగ్ హాల్‌ను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

పాస్‌పోర్ట్ మిస్సింగ్

కొడగాడె మహమ్మద్ షఫీ తండ్రి మహబూబ్ పీరాని సాహెబ్ వయస్సు 58 ఇంటినెంబర్ 46/801-4ఎ1, సఫీయ మెన్సన్. బుధవారపేట, కర్నూలు-518002. 02-10-2009వ తేదిన నా యొక్క పాస్‌పోర్ట్ బి3235909 వరదల్లో మిస్సింగ్ అయినది. నా యొక్క పాస్‌పోర్ట్ పుస్తకము ఎవ్వరికైన చిక్కిన యెడల, నాకు గానీ, నా యొక్క న్యాయవాదికి గాని తెచ్చిఇవ్వగలరు.

కె.బలరాముడు,
బి.యస్సి, బి.ఎల్,
అడ్వకేట్,
కర్నూలు.
సెల్ : 9849722621

సచివాలయాల ద్వారా

ప్రజలకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లోనే గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దనేల టూరు గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాల యం-2ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నసురుద్దీన్, సర్పంచ్ సోమన్న, ఎంపిటిసి లోకనాథరెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, కాంట్రాక్టర్ చిన్ననెలటూరు అమరేశ్వరప్ప, సచివాలయ కాంట్రాక్టర్ టి వీరక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎర్రకోట

లింగాయత్‌లను ఒబిసి జాబితాలో చేర్చాలి

వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేవేంద్రగౌడ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వీరశైవ లింగాయత్‌లను ఒబిసి జాబితాలో చేర్చాలని వీరశైవ లింగాయత్‌ల రాష్ట్ర అధ్యక్షుడు వై.దేవేంద్ర గౌడ్, జాతీయ అడ్వాయిజర్ కమిటీ నాయకుడు జిబి.మనోహర్, కార్యదర్శి జి.రాజేశ్వరిలు కోరారు. శనివారం పట్టణంలోని పెద్ద పార్క్ వెళ్లే మార్గాన దేవి నివాస్ వద్ద కార్యావర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం లింగాయత్ సామజిక వర్గాన్ని ఒబిసి జాబితాలో చేర్చకపోవడం వల్ల ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాల్లో తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. కూలీ, వ్యవ సాయంపై ఆధారపడ్డ ఈ సామాజిక వర్గాన్ని ఓబిసిలు గా గుర్తిం చాల్సిన అవసరం ఉందన్నారు. లింగా యత్‌లు ఐక్య మత్యంతో ముందుకు వెళ్లాలని కోరారు. వీరశైవ లింగాయిత్ నాయకులు రేఖమోహన్, మల్లికార్జున, ప్రతాప్, జయచంద్రరాజు, శివప్రసాద్, నాగరాజు, పరమేష్, మూర్తిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో పాత బస్టాండ్ దగ్గర శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్ నందు సిపిఎం పట్టణ కమిటీ సమావేశం తిప్పన్న అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణానికి తలమానికగా ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థలో ఉంటు ప్రమాదాలకు నిలయంగా మారుతున్న సంబంధిత నేషనల్ హైవే అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని వారు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సుమారు 40 సంవత్సరాలు పైబడి అయిందని బ్రిడ్జి ఇరువైపులా సైడ్ వాల్స్ పడిపోయినప్పుడు మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని వారు మండిపడ్డారు. అదే విధంగా రేణుకంబ విలాస్ దగ్గర బ్రిడ్జి పైకి ఎక్కే మెట్లు పూర్తిగా ప్రమాద కరంగా ఉందని వారు అన్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పరిశీలించి, కొత్త బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపించి నిర్మాణం వెంటనే చేపట్టి,ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వారు తెలిపారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజానీకాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేయగలమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోపాల్, విరేశ్, నాగరాజు, కృష్ణమూర్తి, నాగేంద్ర, ఖాన్, వెంకటేశు లు,,తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాధాకృష్ణ

పేదలను దగా చేసిన వైసిపి ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను దగా చేశారని టిడిపి మాజీ ఇన్చార్జి గుడిసె కృష్ణమ్మ, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావుఫ్ విమర్శించారు. ఆదోని నియోజకవర్గంలోని హానువాలు గ్రామంలో శనివారం ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడారు పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఒక ఇల్లు పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. ఇంటి పన్ను, చెత్త పన్ను, నిత్యవసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వం పట్ల విశ్వాసం కోల్పోయారని వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మండిపడ్డారు. గ్రామ ముఖద్వారం వద్ద గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బసాపురం రామస్వామి, గుడిసె శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, నాయకులు మురళి, గోపాల్, మల్లేష్ ఉన్నారు. **41 వ వార్డులో :** పట్టణంలోని 41వ వార్డు కిల్చిన్‌పేట ప్రాంతంలో ఆదోని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 41 ఇన్‌ఛార్జీ కెబి మల్లికార్జున, శివ, మహానంది, రామాంజి, మల్లికార్జున, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఎక్స్ కౌన్సిలర్ తిమ్మప్ప, కర్నూల్ పార్లమెంటు టిడిపి కార్యదర్శి బుద్ధారెడ్డి పాల్గొన్నారు. **కౌతాళం :** రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమం కాదు.. సంక్షోభం ఏర్పడిందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, క్లస్టర్ ఇంచార్జ్ వెంకటపతి రాజు, మైనార్టీ నాయకులు టిప్పు సుల్తాన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పర హాల్ గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తేదీ వచ్చినా కూడా ఉద్యోగస్తులకు జీతాలు చెల్లించలేని స్థితిలో, ప్రభుత్వం సంక్షోభంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంజు, హుసేని, నాగలింగ, గురులింగ, నరసింహ, రాము, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు. **కోసిగి రూరల్** :రాష్ట్రంలో ప్రజలకు మేలు జరగాలంటే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంను దింపాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి పాలకుర్తి తిక్క రెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ జ్ఞానేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం కోసిగి మండలంలోని వందగల్లు,నేల కోసిగి గ్రామాలలో ఇదేంకర్మ- మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతు ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. వైయస్సార్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేదు కరెంట్ చార్జీలు, నిత్యావసర వస్తువులు రేట్లు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, మొదలుకొని అని రేట్లు పెంచి ప్రజలుపై భారం మోపి ప్రజలను ఆర్థికంగా దెబ్బ తిసి తుగ్లక్ పాలన కొనసాగిస్తూ కాలయాపన చేస్తూ మూడు ప్రాంతాలు, మధ్య చిచ్చు పెడుతున్న పార్టీ వైయస్సార్ పార్టీ అని ప్రజలకు న్యాయము చేసేపై పార్టీ తెలుగు దేశం పార్టీ అని పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వందగల్ మాజీ సర్పంచ్ ననరసింహులు, నాడిగేని మహదేవ్, హనుమంతు రెడ్డి, ఐ టిడిపి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో ..

కౌతాళంలో ..

కోసిగిలో..

కౌన్సిలర్ దయాసాగర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇటీవల ఆదోని రోడ్డులో అనుకోకుండా బైక్ ప్రమాదానికి గురైన 21వ వార్డు గీతామందిర్ ఏరియాకు చెందిన శాంతి కుటుంబ సభ్యులకు గాయాలకు కౌన్సిలర్ దయాసాగర్ ఆర్థిక సాయం అందజేశారు. శనివారం శాంతి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం రవి ,వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శబరికి తరలిన.. అయ్యప్ప స్వాములు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల కేంద్రమైన చిప్పగిరిలో జడ్పిటిసి విరుపాక్షి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ఇరుముడి ధరించి అయ్యప్ప స్వామి దర్శనానికి శనివారం బయలుదేరి వెళ్లారు. జడ్పిటిసి విరుపాక్షి స్వామి ఇరుముడి కార్యక్రమంలో ఎంపీపీ హేమలత భర్త జూటూరు మారయ్య, విద్యా కమిటీ చైర్మన్ కేసర గంగాధర్, వైసిపి నాయకులు నాగప్ప, జూటుర్ లింగన్న, జయన్న, శ్రీరాములు, వెంకటేశు పాల్గొన్నారు.

'రైతు రక్షణ' పాదయాత్ర జయప్రదం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - దేవనకొండ

రైతుల భవిష్యత్తుకు పాలక ప్రభుత్వాలు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరుతూ డిసెంబర్ 16 నుండి 20 వరకు చేపట్టబోయే రైతు రక్షణ కాలినడక పాదయాత్రలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.మద్దిలేటిశెట్టి, ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్.జగదీష్, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం. నరసరావు లు తెలిపారు. శనివారం సిపిఐ,ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎమ్. నెట్టేకళ్ళు అధ్యక్షతన మండల కేంద్రమైన దేవనకొండలో రైతు రక్షణ కాలినడక పాదయాత్రల వాల్ పోస్టర్లు లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రక్షణ కాలినడక పాదయాత్ర జిల్లాలో మద్దికేర, ఆదోని, మంత్రా లయం, కటారు కొండ నుండి 16వ తేదీన ప్రారంభమవుతుందని తెలిపారు. 20వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వేలాది మంది రైతులతో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు రవి కుమార్, భాస్కర్, విజయ్, రైతులు రాజన్న,నబిరసూల్, ఖలీలుల్లాహ్, నరసింహ, రంగస్వామి,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - ఆస్పరి

కేరళలో జరిగే మహాసభలను జయప్రదం చేయండి అన్ని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు అన్నారు. శనివారం మండల పరిధిలోని కైరుప్పల గ్రామములో ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాల పట్ల నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి,నకిలీ పత్తి విత్తనాలు వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు రైతులు సిద్ధం కావాలన్నారు.

ఈ నెల 13 నుండి 16 వరకు జరిగే ఏఐకేఎస్ జాతీయ మహాసభలలో రైతులు పాల్గొని విజయ వంతం చేయా లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగన్న, రామాంజినేయులు, వీరేష్, శివ,రవి, సురేష్,వీరభద్ర, రామాంజిని, రాజు,మహేష్, మహేష్ పాల్గొన్నారు.



జిల్లాలో 'మాండూస్'

- తడిసిన వరి ధాన్యం - కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు
- చలి గాలులతో జనజీవనం అస్తవ్యస్తం

పగిడ్యాలలో వరి ధాన్యం తడిసిపోకుండా టార్పాలియన్ పట్టాలతో కప్పిన రైతులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో మాండూస్ తుపాను ప్రభావంతో చిరు జల్లుల నుంచి ఓ మోసారు వర్షం కురిసింది. శనివారం జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ మండలంలో 20.6 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో అత్యల్పంగా 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వరి పంట కోతలు కోసి మైదానాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తుఫాన్ వర్షానికి తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం తడిచిపోకుండా టార్పాలియన్ పట్టాలు కప్పుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు.

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మాండూస్ తుపాను ప్రభావంతో వర్షం కురిసింది. నంద్యాల 16.6 మి.మీ, బండి ఆత్మకూరు 12.4, ఉయ్యాలవాడ 11.0, చాగలమర్రి 10.0, శ్రీశైలం, గోస్పాడు మండలాల్లో 9.2, బనగానపల్లె 8.6, మిడ్తూరు 8.4, సంజామల 7.8, ఆత్మకూరు 6.8, జూపాడు బంగ్లా 6.6, పగిడాల 6.4, కొత్తపల్లి 6.2, దొర్నిపాడు 6.2, నందికొట్కూరు 5.8, బేతంచెర్ల 5.2, అవుకు 5.2, పాణ్యం సిరివెళ్ల మండలాల్లో 5.0, వెలుగోడు 4.4, గడివేముల 3.6, రుద్రవరం 2.8, డోన్, కొలిమిగుండ్ల, పాములపాడు మండలాల్లో 2.4, కోయిలకుంట్ల మండలంలో 1.0 మి.మీ వర్షపాతం నమోదయింది. ఈ వర్షం పప్పు శనగ పంటకు ఊరట కలిగిస్తున్నప్పటికి వరి ధాన్యానికి తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం లేక పోలేదు. రైతులు వరి కోసి ఆరబెట్టుకున్న దాన్యం తడిసి ముద్ద అవడంతో ధాన్యం నలుపుగా మారే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం కలిగే ప్రమాదం ఉంది.

అకాల వర్షం - తడిసిన వరి ధాన్యం

పగిడ్యాల : మాండూస్ తుఫాన్ వల్ల అకాల వర్షాలు కురవడంతో పండిన పంటలు ఆరబెట్టు కుంటున్న రైతులు విలవిలలాడి పోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కెసి కెనాల్ ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటలు కోతలు మొదలు పెట్టారు. పగిడ్యాల మండలంలో కెసి కెనాల్ ఆయకట్టు కింద 1305 ఎకరాలు వరి సాగు చేశారు. ఇటీవల నుంచి రైతులు వరి కోతలు మొదలు పెట్టి ధాన్యం నూర్పిడి చేసి ఆరబెట్టారు. మాండూస్ తుఫాన్ ప్రభావంతో ఆకాల వర్షాలు కురవడంతో మైదానాలలో ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడిసిపోవడంతో అన్నదాత దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నాడు. వరి పంట తడిసిపోవడంతో నాణ్యత తగ్గి గిట్టుబాటు ధరకు కొకుగోలు చేయరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి దిగుబడులు ఆశాజనకంగా ఉందని ఆనదంలో ఉన్న రైతులను మాండూస్ తుఫాన్ సంతోషాన్ని ఆవిరి చేస్తోంది. ప్రస్తుత వర్షం వల్ల ఆరబోసుకున్న వరి ధాన్యంను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు అన్నదాతలు. ఈ వర్షం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, కంది, శనగ పంటల్లో పూత రాలిపోతుందని, దీంతో కంది, శనగ దిగుబడులు తగ్గే అకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి తడిసిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయలని రైతులు కోరుతున్నారు.

బండి ఆత్మకూర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా ఏడతెరిపిలేని చిరుజల్లులు, అప్పుడప్పుడు భారీ వర్షం పడడంతో పాటు తీవ్రమైన ఈదురు గాలులతో చేతికొచ్చిన పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. తీవ్రమైన చలిగాలులతో జనజీవనం అస్తవ్యస్తమై ప్రజలను ఇళ్లకే పరిమితం చేసింది. పంట కోత సమయంలో మాండోస్ తుఫాన్ ప్రభావంతో మండలంలో దాదాపు 75 శాతం చేలలోనే ఉండి కోతకు తీవ్ర ఆటంకం కలిగించింది. గింజలు రాలి, వరిచేలు నేలకు ఒరిగి రైతన్నకు తీవ్ర నష్టం కలిగించింది. మంచి ధర మంచి దిగుబడి వస్తున్న సమయంలో మాండూస్ తుఫాన్ తీవ్రంగా దెబ్బతీసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

'గర్జన'తో ఒరిగిందేమిటి..?

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ పేరుతో రాయలసీమ గర్జన అని కార్యక్రమం నిర్వహించారు. జేఏసీలోనూ నాన్ పొలిటికల్ జేఏసీ, పొలిటికల్ జేఏసీ అంటూ విభజించారు. పొలిటికల్ జేఏసీలో అధికార పార్టీ నేతలు తప్ప ఇతర నాయకులెవరూ లేరు. ఆ కార్యక్రమానికి కళాశాలల నుండి విద్యార్థులను తరలించారు. ఎండ వేడికి తట్టుకోలేక విద్యార్థులు మధ్యలోనే లేచి వెళ్ళిపోయారు. కార్యక్రమంలో మాట్లాడిన అందరి ప్రసంగ సారాంశం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలనే. మరో పక్క ప్రతిపక్ష నాయకుడిపై విమర్శలు. అసలు ఆ డిమాండ్లు అధికారంలో ఉండే వారు చేస్తే అవి నెరవేర్చాల్సింది ఎవరు..? ఆ గర్జన ఎవరి కోసం..? అనేవి సామాన్యుని మదిలో మెదులుతున్న ప్రశ్నలు. హైకోర్టును కర్నూలులో పెట్టడానికి అన్ని పార్టీలు ఒప్పుకున్నాయి. కానీ ఏర్పాటుకు వైసిపి ప్రభుత్వం వెనక్కి జంకుతోంది. చంద్రబాబు అడ్డం పడుతున్నారని విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు అడ్డం పడటం వల్లే ఆగిపోయినట్లయితే వైసిపి ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలను చంద్రబాబు వ్యతిరేకిస్తున్నారు. అంత మాత్రాన వాటిని అమలు చేయకుండా ఆపేస్తున్నారా..? 2024లో జగన్ అధికారంలోకి వస్తే రాయలసీమకు మేలు చేస్తారని, ప్రాజెక్టులు తెచ్చి సస్యశ్యామలం చేస్తారని నాయకులు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో ఉంది కూడా జగనే కదా..? 2024లోనే ఎందుకు చేయాలనుకుంటున్నారు? ఇప్పుడు చేయడం ఇష్టం లేదా... అంటే అది ఒక ఎన్నికల స్టంట్‌గానే కనిపిస్తోంది. గతంలోని టీడీపీతో పాటు ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వం కూడా రాయలసీమలో ప్రాజెక్టులపై చిన్న చూపు చూస్తూనే ఉన్నాయి. కరువు, వలసల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే హామీల వర్షం గుప్పిస్తున్నారు.

పరీక్ష ఎవరికి..?

పరీక్ష పెట్టేందుకు ఉపాధ్యాయులకూ పరీక్ష తప్పడం లేదు. గతంలో ఫార్మేటివ్, సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రశ్నపత్రాలను రాష్ట్ర విద్యా పరి శోధనా సంస్థ విడుదల చేసేది. వాటికి సంబంధించిన సమాధానాలు తెల్ల పేపరు లేదా ప్రత్యేక నోటు పుస్తకంలో రాయించేవారు. సమ్మెటివ్ పరీక్షకు మాత్రమే ఏకరూప ప్రశ్న పత్రం విధానం ఉండేది. ప్రశ్నపత్రాలను విద్యా శాఖనే పంపిణీ చేసేది. ప్రస్తుతం ఫార్మేటివ్ పరీక్షలకూ ఒకే ప్రశ్న పత్రం ఉండాలని విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. పరీక్ష ముందు రోజు అర్ధరాత్రి 1 గంటకు ప్రధానోపాధ్యాయుడి వాట్సప్‌నకు ప్రశ్నపత్రం వస్తోంది. ఉదయాన్నే ఆయా ఉపాధ్యాయులకు వాట్సప్ ద్వారా పంపితే వారు తరగతి గదుల్లోని బ్లాకు బోర్డుపై చూసుకుంటూ ప్రశ్నలు రాసుకుని పరీక్ష రాయాల్సి వస్తోంది.

సర్దుబాట్లు..

ఈ విద్యా సంవత్సరం ఆరు నెలలు గడిచిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ చర్యల పట్ల ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ సమయంలో సర్దుబాటుకు ఎందుకు చేస్తున్నారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కాలంలో పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించిన వారికి ఎక్కడా స్థానాలు కేటాయించలేదు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో దాదాపుగా 8000 మందికి పైగా ఉపాధ్యాయులు పలు రకాల కేడర్‌లలో పని చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు స్కూల్ మ్యాపింగ్ పూర్తయిన నేపథ్యంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు సిద్ధమైంది.

అవీ..ఇవీ..అన్నీ..

ఎఐకెఎస్ జాతీయ మహాసభ సందర్భంగా చేపట్టిన అమరవీరుల జ్యోతి జాతా జిల్లాలో సాగింది. ఆత్మకూరులో నంద్యాల టర్నింగులో బహిరంగ సభ నిర్వహించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళులు అర్పించారు. అంతర్జాతీయ వికలాంగ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

రెండోరోజు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 41వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖోపోటీలు శనివారం రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. శిల్పా కార్తీక్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. బాలికల క్రీడా పోటీల్లో రెండవ రోజు చిత్తూరు జిల్లాపై అనంతపురం జిల్లా, నెల్లూరు జిల్లాపై విశాఖపట్నం జిల్లా, కర్నూలు జట్టుపై శ్రీకాకుళం జిల్లా, కృష్ణా జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా, కడప జిల్లా జట్టుపై పశ్చిమగోదావరి జిల్లా, నెల్లూరుపై చిత్తూరు జిల్లా, తూర్పుగోదావరిపై కర్నూలు జిల్లా, కృష్ణా జిల్లాపై విజయనగరం, పశ్చిమగోదావరిపై ప్రకాశం, నెల్లూరుపై అనంతపురం, విజయనగరంపై గుంటూరు, కడపపై ప్రకాశం జిల్లా జట్లు విజయం సాధించాయి. బాలుర జట్టులో కర్నూలుపై నెల్లూరు, విశాఖపట్నంపై ప్రకాశం, గుంటూరుపై పశ్చిమగోదావరి, అనంతపురంపై శ్రీకాకుళం, కడపపై చిత్తూర్, కర్నూల్‌పై విశాఖ, నెల్లూరుపై ప్రకాశం, కృష్ణాజిల్లాపై గుంటూరు, శ్రీకాకుళంపై విజయనగరం, చిత్తూరుపై తూర్పుగోదావరి, కడపపై తూర్పుగోదావరి జిల్లా జట్లు విజయం సాధించాయి. ఉదయం వర్షం వల్ల క్రీడా పోటీలు ఆలస్యంగా జరిగినప్పటికీ అనుకున్న స్థాయిలోనే నిర్వాహకులు పోటీలు నిర్వహించారు.

క్రీడాకారులతో శిల్పా కార్తీక్ రెడ్డి

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 12, 13వ తేదీల్లో జరిగే సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యా అధికారి కరీం బాషా కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉన్నత, ప్రాథమిక, ప్రభుత్వ ప్రవేట్ యాజమాన్యాల పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో ఈకో ఫ్రెండ్లీ మెటీరియల్, హెల్త్ అండ్ క్లీన్ నెస్, సాఫ్ట్వేర్ అండ్ యాడ్స్, మ్యాథమెటిక్స్ అండ్ మోడలింగ్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రాజెక్ట్స్ అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను కనబరచాలని, అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సంజీవరెడ్డి, జెడ్పిటిసి తులసమ్మ, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు.

27, 28న సిఐటియు జిల్లా మహాసభ

- జయప్రదం చేయండి : నేతలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలో ఈ నెల 27, 28వ తేదీల్లో జరుగు సిఐటియు నంద్యాల జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఏ.నాగరాజు, జిల్లా నాయకులు వెన్న బాల వెంకటేలు కోరారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉద్యోగ కార్మిక వర్గాలకు, వారి పోరాటాలకు అండగా నిలుస్తున్న సిఐటియు జిల్లా రెండవ మహాసభకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా 400 మంది కార్మిక ఉద్యోగ ప్రతినిధులు, నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అశేష త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుగుణంగా మార్చేందుకు కుట్ర పన్నుతోందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి, టిడిపిలతో కుమ్మక్కై సవరణలు చేశాయని, 44 కార్మిక చట్టాలను 4 సివిల్ కోడ్స్‌గా మార్చి కార్మికచట్టాలకు పస లేకుండా చేసే కుట్ర పన్నుతున్నాయని అన్నారు. ఫలితంగా కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కోల్పోతున్నారని తెలిపారు. కార్పొరేట్లు ప్రభుత్వ విధానాలను శాసిస్తుండడంతో కార్మిక వర్గానికి, ఉద్యోగులకు మరింత కష్టాలు పెరుగుతున్నాయని అన్నారు. కేంద్రంలో ప్రభుత్వం ఒకవైపు పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రుణాలు ఇవ్వడం, మరుసటి సంవత్సరమే ఆ రుణాలను రద్దు చేస్తూ సామాన్యులపై ఆ భారాలను మోపుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని అన్నారు. వైద్య, విద్య రంగాలను ప్రైవేటీకరణ వేగవంతంగా చేస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచి రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో రాజీలేని పోరాటాలు చేయడానికి ఈ నెల 27, 28వ తేదీల్లో నంద్యాలలో జరుగు సిఐటియు నంద్యాల జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. మహాసభ సందర్భంగా ఈ నెల 27వ తేదీ నంద్యాల పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, జిల్లాలోని అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, హమాలీ, భవన నిర్మాణ, స్వచ్ఛ భారత్, గ్రామ పంచాయతీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, విఆర్ఏలు, ఎలక్ట్రికల్ ఉద్యోగులు, ప్రభుత్వ పథకాలలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

30 రోజుల్లోనే రోడ్డు పనులు పూర్తి చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్

డోన్‌లోని పాత బస్టాండ్, బుగ్గన శేషారెడ్డి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్డు 30 రోజుల్లో పూర్తి అవుతుందని మున్సిపల్ చైర్మన్ సప్త శైల రాజేష్ తెలిపారు. రోడ్డు కనెక్టివిటీ నిర్మిస్తున్న కల్వర్టు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 2 కోట్ల 80 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కల్వర్టు నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని, గమనించి సహకరించాలని కోరారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో పట్టణంలోని రోడ్లన్నీ నాణ్యతగా నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధిలో డోన్ పట్టణం శరవేగంగా ముందుకు వెళుతుందని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున, సైట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

ప్రపంచానికి ఆదర్శం మన సంస్కృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రపంచంలోని దేశాలకు ఆదర్శం భారతదేశ సంస్కృతి సంప్రదాయాలని మతసామరస్య చైతన్య వేదిక మండల అధ్యక్ష కార్యదర్శులు యస్. నూర్ అహ్మద్, మహమ్మద్ గౌస్ అన్నారు. శనివారం బేతంచెర్లలోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప, భవాని మాలాదారులకు హిందూ ముస్లిం నాయకులు సహ పంక్తి భోజనాలు (బిక్ష) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిందూ ముస్లిం పెద్దలు మాట్లాడుతూ మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ స్నేహభావంతో కలిసిమెలిసి జీవిస్తే ఎటువంటి సమస్యలు రావన్నారు. ఒకవేళఏ సమస్య వచ్చినా త్వరగా పరిష్కరించడానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప, అంబా భవాని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప, భవాని మాలదారులకు బిక్ష ఏర్పాటు చేసిన నూర్ అహమ్మద్, మహమ్మద్ గౌస్‌లు

శ్రీశైలంలో దేవదాయశాఖ మంత్రి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి శ్రీశైలం చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి దేవస్థానం అతిథి గృహం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న స్వాగతం పలికారు. శనివారం ఉదయం ఉప ముఖ్యమంత్రి కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లని దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం కార్యనిర్వహణాధికారి లవన్న, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సంప్రదాయం స్వాగతం పలికారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

అన్నదాన పథకానికి విరాళం : శ్రీశైలం దేవస్థానం క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన పివి రవీంద్ర 1 లక్ష 5 రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే కర్నూలుకు చెందిన జొన్నలగడ్డ మూర్తి రూ.1,00,116, గో సంరక్షణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఏ.సబ్బయ్య రూ.1,01,116 విరాళం అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

స్వాగతం పలుకుతున్న దేవస్థానం ఇఒ లవన్న

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ఆత్మకూర్ : ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు రణధీర్, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలను రెగ్యులర్ చేసి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక అలవెన్స్ వెంటనే ఇవ్వాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన ఆశా కార్యకర్తలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాల మార్పును ఆపాలన్నారు. మరణించిన, రిటైర్మెంట్ అయిన ఆశా కార్యకర్తల స్థానంలో అర్హులైన కుటుంబ సభ్యులను ఆశాలుగా తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం శిక్షణ పొందిన ఆశ కార్యకర్తలకు వెయిటేజ్ ఇచ్చి ఏఎన్ఎంగా భర్తీ చేయాలన్నారు. నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలన్నారు. సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సామ్మక్క, శారద, సత్యమ్మ, గౌరి, సుజాత, చెన్నమ్మ, సిఐటియు నాయకులు మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గంగన్నకు సమాజ సేవ పురస్కారం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని టౌన్ హాల్‌లో ప్రపంచ మానవ హక్కుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ సుబ్బారెడ్డి, కన్వీనర్ కృష్ణ కిషోర్, కమిటీ సభ్యులు ఆళ్లగడ్డకు చెందిన డాక్టర్ గంగన్నకు సమాజ సేవా పురస్కారం అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. వివిధ రంగాలలో సమాజసేవలు చేస్తున్న వారిని గుర్తించి ఐదు రాష్ట్రాలకు చెందిన (తమిళనాడు, కర్ణాటక,మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) 153 మందికి చైర్మన్ సుబ్బారెడ్డి, నెల్లూరు నగర మేయర్ స్రవంతి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణ, ఎస్‌సి, ఎస్‌టి మెంబర్ రఘు, హైకోర్టు లాయర్ వెంకటేశ్వర్లు తదితరులు సన్మానించారు. అందులో భాగంగా ఆళ్లగడ్డకు చెందిన డాక్టర్ గంగన్న సేవలను గుర్తించి ఆయనకు శాలువా కప్పి 'సమాజ సేవ పురస్కారం' అవార్డు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ గంగన్న మాట్లాడుతూ గత 27 సంవత్సరాల (1995) నుండి పేద విద్యార్థులకు, వృద్ధులకు, ఆర్థికంగా, సామాజికంగా, వెనుకబడిన వారికి, కులం మతం బేదం లేకుండా సేవ చేస్తున్నామన్నారు. తనకు ఈ పురస్కారం రావడం ఆనందంగా ఉందని, తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

డాక్టర్ గంగన్నను సన్మానిస్తున్న దృశ్యం

అధికారులను అడ్డుకున్న దళితులు

నందికొట్కూరు : మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో సుమారు 20 సంవత్సరాల క్రితం దళితులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలలో రెవెన్యూ అధికారులు కో-ఆపరేటివ్ సొసైటీ భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో దళితులు అడ్డుకున్నారు. గతంలోనూ తమ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ధర్నాలు, ఆందోళన నిర్వహించారు. శనివారం ఆర్‌డిఒ దాసు, తహశీల్దారు స్థల సేకరణకు రావడంతో దళితులు అధికారులను అడ్డగించారు. ఎలాంటి కట్టడాలకు అనుమతి ఇవ్వబోమని నిరసన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్ బాబు, వీఆర్వోలు, మాల మహానాడు నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకుంటున్న దళితులు

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులుగా టంగుటూరి శీనయ్య

- 11న ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు టంగుటూరి శీనయ్య ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర, జిల్లాల నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షునిగా టంగుటూరి శీనయ్యను, ప్రధాన కార్యదర్శిగా సిఎం శ్రీనివాసులు, కోశాధికారిగా పసుపుల నగేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక విలేకరులతో టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ కర్నూల్‌లోని మౌర్యఇన్‌లో నంద్యాల, కర్నూలు జిల్లా కమిటీల ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. తనను నంద్యాల జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు, సహకరించిన టిజి వెంకటేష్‌కు, ఇల్లూరి లక్ష్మయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కోఆర్డినేటర్ ఇల్లూరి లక్ష్మయ్య, మాజీ జిల్లా అధ్యక్షులు ఇల్లూరి సుధాకర్ శెట్టి, గుండా శ్రీధర్, కార్యదర్శి భరతుడు, సుబ్రహ్మణ్యం శెట్టి , మాజీ సింగల్ విండో అధ్యక్షులు మల్లారెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి శీనయ్య

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా సెక్రటరీగా చాటకొండ శ్రీనివాసులు

డోన్ : డోన్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు చాటకొండ శ్రీనివాసులును ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా సెక్రటరీగా ఏన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ కర్నూల్‌లోని మౌర్యన్ లో నంద్యాల, కర్నూలు జిల్లా కమిటీల ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు తెలిపారు . నంద్యాల జిల్లాలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తనను జిల్లా సెక్రటరీగా ఎన్నుకున్నందుకు, సహకరించిన టిజి వెంకటేష్‌కు, ఇల్లూరి లక్ష్మయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చాటకొండ శ్రీనివాసులు

కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వ హిస్తున్న వైద్యులు

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం ఆనకట్ట, ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలల వజ్రోత్సవాల సందర్భంగా శని, ఆదివారాల్లో సుండిపెంట కాలనీలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం చేపట్టారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మెగా మెడికల్ క్యాంపునకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు దాదాపు 700 మంది వివిధ రకాల వైద్య పరీక్షలను చేయించుకొని ఉచితంగా మందులను పొందారు. ఈ వైద్య శిబిరానికి దాదాపు 24 మంది వైద్య నిపుణులు హాజరై గుండె, కంటి, గ్యాస్ట్రిక్, ఎముకలు, స్త్రీలకు సంబంధించిన వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. నేడు చివరి రోజు పూర్వ విద్యార్థుల సంఘం ప్రెసిడెంట్ మాజీ జెడ్పి వివి. లక్ష్మీనారాయణ హాజరై పాఠశాల వజ్రోత్సవాల్లో పలు సూచనలు ఇవ్వనున్నారు. మెడికల్ క్యాంపులో పూర్వ విద్యార్థులు అన్న వేణుగోపాల్, కిషోర్, రామాంజనేయులు, తొండం వెంకటేశ్వర్లు, శాంతి లత, విశ్వనాథ్, అన్నపూరం వెంకటేశ్వర్లు, ప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

- విద్యార్థి సంఘాలు డిమాండ్

నంద్యాల అర్బన్ : సెలవు రోజు కూడా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న భాష్యం స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, స్కూల్ గుర్తింపును విద్యా శాఖ అధికారులు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పూల వెంకట్, వేణు మాధవ్ రెడ్డి, నాగన్న, కుమార్, రమేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ రెండవ శనివారం కూడా పట్టణంలో కొన్ని స్కూల్స్ తరగతులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఎటువంటి పర్యవేక్షణ చేయడం లేదన్నారు. విద్యా శాఖ అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి నిబంధనలకు విరుద్ధంగా వున్న స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

బలపనూరు పశు వైద్యాధికారికి ప్రమోషన్

పాణ్యం : మండలంలోని బలపనూరు గ్రామంలో నాలుగున్నర సంవత్సారాలు నుండి పశు వైద్యులుగా పని చేస్తున్న లోకేష్ స్టాటిస్టికల్ అధికారిగా ప్రమోషన్ పొందారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను పాణ్యం పశు వైద్య శాల సిబ్బంది కొనియాడారు. లోకేష్ మాట్లాడుతూ ఇన్నాళ్ల సర్వీస్‌లో తనకు సహకరించిన సిబ్బందికి, ప్రజలకు, రాజకీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల ఘనీకత వీర్య కేంద్రం నుండి బదిలీపై వచ్చిన డాక్టర్ చిన్న పుల్లయ్య బలపనూరుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో పాణ్యం సహాయ సంచాలకులు కమలాకర్, నంద్యాల ఉప సంచాలకులు డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మందలూరులో పారిశుధ్య పనులు

రుద్రవరం : మండలంలోని మందలూరు గ్రామంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచి సగలి నిర్మల దేవి తెలిపారు. గ్రామ వైసిపి నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధుల్లో రోడ్లపై పేరుకుపోయిన మట్టిని ట్రాక్టర్ సహాయంతో తొలగించి గ్రామ వెలుపలకు తరలించారు. మట్టిని తొలగించిన చోట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్, వేస్ట్ ఆయిల్, క్రిమిసంహారక మందులను చల్లించారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సర్పంచి సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కర్నూలు ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జడ్జిగా ఫయాజ్

- అభినందించిన బిసి ఇందిరా

ఫయాజ్‌ను అభినందిస్తున్న బిసి ఇందిరా

బనగానపల్లె : ఎపి బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన జడ్జి ఎగ్జామినేషన్ టెస్ట్‌లో బనగానపల్లెకు చెందిన జె.ఫయాజ్ ఉమ్మడి జిల్లాల జడ్జిగా ఎంపికయ్యారు. శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి నివాసంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చైర్మన్ బిసి ఇందిరాను జె.ఫయాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఫయాజ్‌ను బిసి ఇందిరా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఫయాజ్ మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

- వ్యక్తికి గాయాలు

నందికొట్కూరు : మండలంలోని అల్లూరు గ్రామంలో ఇంటి ముందర నీళ్లు చల్లుకునే విషయంలో రెండు కుటుంబాల మధ్య శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసులు ఇంటి ముందరకు ఎగువన ఉన్న వివేకానందుడు ఇంటి ముందర చల్లిన నీళ్లు వస్తుండడంతో ఇరు కుటుంబాల మహిళల మధ్య ఘర్షణ మొదలైంది. మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వివేకానందుడు తన కుటుంబ సభ్యులతో కలిసి గొడ్డలితో శ్రీనివాసులుపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాసులును నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి ఇరు కుటుంబాలపై కేసు నమోదు చేశారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు భూమి పూజ

బేతంచెర్ల : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో, పెద్ద కొలుములపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పాపసాని కొట్టాల గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డిలు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలకతీతంగా గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో రాబోయే ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకూడదని కోట్ల రూపాయలతో రోడ్లు, నీటి సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, బాబు రెడ్డి, గూని నాగరాజు, కోడె వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, రంగాపురం సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, చిన్న మద్దమ్మ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న నాయకులు

విద్యార్థి ఉద్యమ అమరవీరుల

పతాక యాత్రను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - డోన్

కేరళలో ఈ నెల 8న ప్రారంభమైన విద్యార్థి ఉద్యమ అమరవీరుల పతాక యాత్ర నేడు ఆదివారం సాయంత్రం డోన్ పాత బస్టాండుకు చేరుకుంటుందని, అధిక సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని యువజన సమైక్య మాజీ జిల్లా నాయకులు నక్కి శ్రీకాంత్ కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 13 నుంచి 16 వరకు జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ అఖిల భారత మహాసభ జయప్రదం కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార రథాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడడంలో ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగం ఎదుర్కోబోతున్న పరిస్థితులపైన సమీక్షించి విద్యాభివృద్ధికి కృషి చేయడం కోసం ఈ అఖిల భారత మహాసభ వేదిక కానున్నాయని తెలిపారు. విద్యా రంగంలో ఒక గొప్ప అధ్యయన శక్తిగా ఎస్ఎఫ్ఐ పని చేస్తుందని కొనియాడారు. నేడు దేశంలో ప్రభుత్వ విద్య ప్రశ్నార్థకం అవుతున్న ప్రమాదం పొంచి ఉందని, దానికి కారణం కేంద్ర ప్రభుత్వం విద్యారంగ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాసే విధంగా జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యను మతోన్మాదం వైపు మళ్ళించే చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు మేలుకొని విద్యారంగాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు అశోక్, తెలుగు విజయ్, మండల సహాయ కార్యదర్శి సునీల్, మాబు, మండల కోశాధికారి ఇర్ఫాన బేగం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షమీమ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆటో ప్రచార రథాన్ని జెండా ఊపి యువజన సమైక్య మాజీ జిల్లా నాయకులు నక్కి శ్రీకాంత్

ఘనంగా చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోనిపాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ ఎస్.బాబు, రాష్ట్ర ఆడిట్ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య తన చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగంలో చేరి ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడారని, సంఘాన్ని స్థాపించి హక్కుల కోసం కృషి చేయాలనే తలంపుతో ఉద్యోగంలో చేరిన నాటి నుంచి తను చనిపోయేవరకు ఉద్యమం కోసమే జీవితాన్ని అంకితం చేసిన అత్యంత ఆదర్శమూర్తి అన్నారు. చెన్నుపాటి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, బివై.సుబ్బరాయుడు, జి.సుబ్బారాయుడు, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రఘు నాయక్, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** యుటిఎఫ్ ప్యాపిలి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటానికి యుటిఎఫ్ సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు సర్వజ్ఞమూర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, రఘు నాయక్, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

చెన్నుపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్థానిక విశ్వరూప పారిశ్రామిక నగర్‌లోని కాళికా మాత దేవాలయము నందు వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ (శంకుస్థాపన) కార్యక్రమం ఆలయ కమిటీ అధ్యక్షుడు శిల్పి దురుగడ్డ రవీంద్రచారి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కందిమల్లాయపల్లి బ్రహ్మంగారి మఠం భవిష్యత్తు మఠాధిపతులు వెంకటాద్రి స్వామి, జగన్మాత ఈశ్వరి మహాదేవి మఠాధిపతులు వీర శివకుమార్ స్వామి, అచలానంద ఆశ్రమ పీఠాధిపతులు విరజానంద స్వామి పాల్గొన్నారు. ముందుగా మఠాధిపతులకు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర ఆచారి పూర్ణకుంభంతో స్వాగతం పలికి కాళికామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత మఠాధిపతుల చేత శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం మఠాధిపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం పీఠాధిపతులు శారద శిల్పకళా మందిరం వద్దకు వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు విజయకుమార్ ఆచారి, ప్రధాన కార్యదర్శి చిన్న పుల్లయ్య ఆచారి, కోశాధికారి మోహనాచారి, గౌరవ అధ్యక్షుడు శిల్పి శ్రీనివాసులాచారి, బాణాల గోపాలచారి, రాయలసీమ విశ్వబ్రాహ్మణ సంఘం కో-కన్వీనర్ సహదేవచారి, కమిటీ సభ్యులు రామభద్రయ్య ఆచారి, శ్రీనివాసులుఆచారి, కృష్ణమాచారి, బాణాల పుల్లయ్య ఆచారి, శిల్పి దురుగడ్డ శేఖర్ ఆచారి, బాల ఆంజనేయులు ఆచారి, ఎం సురేష్ ఆచారి, సాయన్న ఆచారి, హరికృష్ణ ఆచారి, పృద్వి ఆచారి, రాఘవాచారి, ఓబయ్య ఆచారి, శివకుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శారద శిల్పకళా మందిరం వద్ద పీఠాధిపతులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - మిడుతూరు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు కె.భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మిడుతూరులోని సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ స్కావెంజర్ల జనరల్ బాడీ సమావేశం సిఐటియు మండల అధ్యక్షులు లింగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.భాస్కర్ రెడ్డి, మండల కార్యదర్శి నాగమణి, సహాయ కార్యదర్శి వెంకట శివుడు మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంలో 88 వేల మంది వంట కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వారికి సామాజిక భద్రత పెన్షన్ లేవన్నారు. పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నా ఎలాంటి వైద్య సౌకర్యం లేదన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం, స్కూల్ స్కావెంజర్లు సంఘం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు రహమత్ బి, ఉపాధ్యక్షులు నాగలక్ష్మమ్మ, కార్యదర్శి రమణమ్మ, సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, ట్రెజరర్ చంద్రకళలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంజకర్ణమ్మ, దేవమని, రమణమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఎఐకెఎస్ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

కేరళ రాష్ట్రంలో గల త్రిశూర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 13 నుండి 16వ తేదీ వరకు జరుగుతున్న ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు లంకా సుబ్బరాయుడు కోరారు. శనివారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పశువైద్యశాల సమీపంలో ఎఐకెఎస్ జెండాను రైతు సంఘం సీనియర్ నాయకులు నీలి వెంకట కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులపై కఠినమైన ఆంక్షలు అమలు చేస్తున్నందున, వాటిని ఎదిరించడానికి రైతులు ఏకం కావాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు చట్టబద్ధమైన మద్దతు ధర, వ్యవసాయంపై ఆధారపడి జీవించడానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, పంటలకు బీమా సౌకర్యం కల్పించి సంక్షేమ పథకాలు రైతులకు షరతులు లేకుండా వర్తింప చేయాలని అఖిల భారత మహాసభలలో చర్చించి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఏఐకెఎస్ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయడానికి రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బయ్య, మధు గౌడ్, ఈశ్వర్ రెడ్డి, సత్యం, రంగారెడ్డి, మహమ్మద్ రఫీ, రమణయ్య, రహంతుల్లా, మహబూబ్ బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు నీటి వెంకట కృష్ణా రెడ్డి

మూడు ఇండ్లలో చోరీ

ప్రజాశక్తి - అవుకు

పట్టణంలోని మండపం వీధిలో ఉన్న మూడు ఇండ్లలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు, అవుకు ఎస్సై జగదీశ్వర రెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండపం వీధిలోని ఓ రిటైర్డ్ ఏఎస్ఐ ఇంటితో పాటు మరో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఓ ఇంట్లో 2000 రూపాయలు, మరో ఇంట్లో రెండు తులాల బంగారు అపహరించారు. దొంగలను గుర్తించేందుకు నంద్యాల నుండి ప్రత్యేక క్లూస్ టీంను పోలీసులు రంగంలోకి దింపారు. ఎవరైనా తమ ఇండ్లకు తాళం వేసే సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని పదేపదే చెబుతున్నప్పటికీ ప్రజల్లో ఎలాంటి మార్పు రావడం లేదని పోలీసులు వాపోయారు. చోరీకి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

జాతీయ స్థాయి చెస్ ఎంపిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని రామకృష్ణ పీజీ కాలేజీలో శనివారం చదరంగం జాతీయస్థాయి ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు రాపిడ్, బ్లీటజ్ రెండు టోర్నమెంట్లుగా జరుగుతాయి. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రామకృష్ణ విద్యాసంస్థల అధినేత జి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఉదయ్ కుమార్, ఆర్బిటర్లు ఇమామ్ హుస్సేన్ సుజాత, ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ కోశాధికారి శ్రీనిషలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయికి చదరంగం ఎంపిక పోటీలు నంద్యాలలో జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఈ పోటీలలో క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు ఫిబ్రవరిలో జమ్మూ కాశ్మీర్లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, టోర్నమెంట్ డైరెక్టర్ రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి : బిసి ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని బిసి ఇందిరా, ప్రముఖ పారిశ్రామికవేత్త, గాలి మద్దిలేటి రెడ్డి కుమారుడు గాలి సీతారామి రెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ముత్తుకూరు శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బిసి ఇందిరా మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి అవసరమైన వారికి గ్రూపు సంబంధించిన రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకు ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సభ్యులు రక్తదాన శిబిరాలు పెట్టి రక్తదానం చేయడం హర్షనీయమన్నారు. రక్తదాన కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి బిసి ఇందిరా, ముత్తుకూరు శ్రీనివాసులు, గాలి సీతారామిరెడ్డిలు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ప్రతినిధి షాషావలి, లాయర్ బాబు, పవన్, ముజీబ్, రఫీ, చరణ్, దాదాపీర్, ఇద్రుస్ బాషా, రామక్రిష్ణ, మస్తాన్ వలి, సందీప్, మహమ్మద్, అత్తార్ ఆరిఫ్, జావీద్, శివ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీసీ ఇందిరా

తల్లిదండ్రులకు విద్యపై అవగాహన

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టణంలోని బాలాకాడమీ పాఠశాలలో లీడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యకు సంబంధించిన అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజినల్ అకాడమిక్ ఎక్స్‌పర్ట్ జి.చంద్ర శేఖర్ రెడ్డి, సీనియర్ ఏరియా మేనేజర్ కె.అరుణ్ కుమార్, కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, పాఠశాల సలహాదారిణి కామేశ్వరిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జి.చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యావిధానంలో మారుతున్న కాలానుగుణంగా చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ఎన్ఇపి విద్యా విధానం ప్రకారం ఇంటర్నేషనల్ స్టాండెడ్ ఎడ్యుకేషన్ అనుగుణంగా కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ను, కోడింగ్ విధానాలను, విద్యను పెంపొందించుకునే నైపుణ్యాలను లీడ్ సంస్థ ద్వారా అభివృద్ధి పరుచుకోవచ్చన్నారు. ఇందులో చిన్నారుల కమ్యూనికేషన్ స్కిల్స్ స్థాయిను బట్టి వారికి లెవెల్స్‌లను కేటాయించనున్నట్లు తెలిపారు. కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానంలో తప్పనిసరిగా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. అవగాహన సదస్సులో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోటయ్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో జరిగిన ఎంపిక పోటీలలో అండర్-14, 17 ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి ఎంపికైనట్లు చెప్పారు. అండర్-17లో ఆస్మా, వైష్ణవి, నరసింహా,ఆనంద్, అండర్-14లో పండు ఎంపికయ్యారన్నారు. అండర్-17కు ఎంపికైన వారు ఈ నెల 21 నుంచి 23 వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను,వ్యాయామ సంచాలకులు దాదాపీర్, పిఈటి భారతిలను హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

తుఫాన్ రాకతో పప్పుశనగకు ఊరట

సంజామల : మాండూస్ తుఫాన్ ప్రభావంతో సంజామల మండలంలో శనివారం కురిసిన వర్షం పప్పు శనగ పంటకు కొంత ఊరటనిచ్చింది. పంట వేసినప్పటి నుంచి నెల రోజులుగా వర్షం లేకపోవడంతో దిగుబడి రాక నష్టపోతామని అనుకుంటున్న సందర్భంలో తుఫాన్ రాకతో సెనగ పంట పుష్కలంగా పండుతుందని రైతులు ఆనంద పడుతున్నారు. మిగతా పంటలకు కూడా ఈ తుఫాను వర్షం కొంత మేలే జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

విఆర్ఎలకు ప్రమోషన్లు కల్పించాలి

బనగానపల్లె రూరల్ : విఆర్ఎలకు ప్రమోషన్ ఇవ్వాలని విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బనగానపల్లెలో విఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్ఏలకు వారసత్వం హక్కు కల్పించాలని, పే స్కేలు అమలు చేయాలన్నారు. విఆర్వోల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. అధ్యక్షులు బాలన్న, వీఆర్ఏలు శివన్న, బాలనాయుడు, గౌస్ పీరా తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఆలస్యంపై ప్రభుత్వం స్పందించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉపాధ్యాయ ఉద్యోగుల జీతాలు ఆలస్యంపై ప్రభుత్వం స్పందించాలని ఎస్టీయు రాష్ట్ర సహఅధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర సహ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడారు. గత యాభై సంవత్సరాల నుండి రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు నెల జీతాలు 10వ తేదీ వచ్చిన బాంక్ ఖాతాలలో జమాకాని దాఖలాలు లేవని, ఈ ప్రభుత్వం కూడా గతంలో ఇంత ఆలస్యం చేయలేదన్నారు. నవంబర్ నెలకు మాత్రమే ఎందుకు ఆలస్యం అవుతుందో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు ఆలస్యం కావడంతో బ్యాంకు రుణాలకు, పిల్లల ఫీజులు, వైద్యఖర్చులకు, చివరికి ఫోన్ రిచార్జీకి డబ్బులు లేక, పాఠశాల విద్యకు సంబంధించిన అన్ని యాప్స్ పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత సమస్యలు పరిస్కారం కాక ఉద్యోగులు సతమతం అవుతుంటే ఇప్పుడు జీతాలను ఆలస్యం చేసి కొత్త సమస్యలు సృష్టించడం పట్ల ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఈ పరంపర ఇట్లే కొనసాగితే ఉద్యోగులు ఉద్యమాలకు ఏకం కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, కార్యదర్శి ఇగ్బాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అజాం బేగ్, మౌలాలి, సీనియర్ నాయకులు సుబ్బారాయుడు, సుబ్బయ్య, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మహారాజశ్రీ ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.3/2020 in O.S.No.71/2017
1) కె.శ్రీరామ్‌నాయక్ (Died by LRs)
2) కె.పుల్లమ్మ బాయి & ఇతరులు.
..అర్జీదార్లు/డిక్రీహోల్డర్స్
V/s
టి.నారాయణ రెడ్డి. ...రెస్పాండెంట్/జె.డి.ఆర్
వేలం ప్రకటన
పైన కనబరచిన డిక్రీహోల్డర్‌కు జె.డి.ఆర్. నుండి రావలసిన ఇ.పి సొమ్మును రాబట్టుకొనుటకు ఈ క్రింద కనబరచిన ఇ.పి షెడ్యూల్డు దాఖలు ఆస్తిని 14.12.2022 తేది ఉదయం 10.30 ని॥ పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. కావున కొనదలచినవారు ఎవరైనా బహిరంగ వేలంలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు :- నంద్యాల జిల్లా, నంద్యాల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, ఆత్మకూరు సబ్.రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, ఆత్మకూరు రెవిన్యూ మండలం, ఇందిరేశ్వరం రెవిన్యూ గ్రామ పరిధిలో గల జె.డి.ఆర్ యొక్క ఆస్తివివరాలు:
సర్వేనెంబర్ : 121
విస్తీర్ణం : ఎకరాలు 6.80 సెంట్లు
శిస్తు : రూ.8.00
చేనిపేరు : వాగు గడ్డ చేను
డి.హెచ్.ఆర్ విలువ : రూ.6,00,000/-
అమీన విలువ : రూ.48,00,000/-
చెక్కుబంది :
తూర్పు : శాలిమియ్య మరియు డి.సుబ్బరాయుడు భూములు
పడమర : టి.లింగమ్మ, రాఘవరెడ్డి, టి.నారాయణ రెడ్డి, సుగుణపాల్ మరియు రెస్పాండెంట్ భూములు
ఉత్తరం : డి.వరలక్ష్మి, డి.సుబ్బరాయుడు & సుబ్బయ్య భూములు
దక్షిణం : వరదరాజు చెరువు వాగు
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 14-12-2022
వేముల.వెంకటేశ్వర్లు,
అర్జీదారు న్యాయవాది,
ఆత్మకూరు,
నంద్యాల జిల్లా.
సెల్ : 9885315007